www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 15 జూన్ 2025
5
అన్నమయ్య



విమాన ప్రమాద మృతులకు నివాళి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలోని మృతులకు శనివారం సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈనెల 12న అహ్మదాబాద్ నుంచి లండన్ కు బయలుదేరిన విమానం కొద్ది సేపట్లోనే వైద్య కళాశాలపై పడి కూలిపోయి వందలాదిమంది మృతి చెందడం అత్యంత బాధాకర సంఘటన అని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిట్రేల రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇంతటి ఘోర ప్రమాదం దేశ చరిత్రలోనే ఇదే ప్రథమం కావచ్చునని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్, రమణ, సునీత, వెంకటమ్మ, ఎం.రమణ పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికుల పిల్లలకూ
తల్లికి వందనం వర్తింపజేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం పురపాలక కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో అలమటిస్తూ వారి పిల్లలకు నాణ్యమైన విద్యను అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. పారిశుధ్య కార్మికులుగా ఎస్సీ, ఎస్టీ, బిసి సామాజిక వర్గానికి చెందిన వారే ఉన్నారని, వారి సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు వారికి కూడా వర్తింపజేయాలన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన తల్లికి వందనం పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారని పేర్కొన్నారు. సుమారు రూ.10,098 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారని తెలిపారు. రాష్ట్రంలో 48 వేల మంది మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాకపోవడం కార్మికులందరినీ తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని చెప్పారు. పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తామని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులు చాలీచాలని వేతనాలతో బతుకుతున్న తమ కుటుంబాలకు కూడా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వాలకు మొరపెట్టు కుంటున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలుచేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారని చెప్పారు. ఆచరణలో వచ్చేసరికి అందుకు భిన్నంగా మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశ తదితర కార్మికుల పిల్లలకు మొండిచేయి చూపారని పేర్కొన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో పాటు స్కీం వర్కర్లందరికీ కూడా తల్లికి వందనంతో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికుల కుటుంబ సభ్యులకు వర్తింప చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.రమణ, బుజ్జమ్మ, సునీత, ప్రమీల, ప్రసన్న, సురేష్ , కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాజంపేట : మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మదనపల్లె అర్బన్ : మున్సిపల్ కార్మికుల పిల్లలకు తల్లికి వందనం వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ ఎపిమున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కోశాధికారి రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన తల్లికి వందనం కార్యక్రమంలో సుమారు రూ.10,098 కోట్ల విడుదల చేసినట్లు సిఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. రాష్ట్రంలో48 వేలమంది మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం నిధులు జమ కాకపోవడం కార్మికులందరినీ తీవ్ర అసంతృప్తికి గురిచేసిందన్నారు. పారిశుధ్య కార్మికులకుఆదాయ పరిమితితో సంబంధం లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేస్తామని ప్రభుత్వాలు హామీలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఇంజనీరింగ్ కార్మికులు చాలీ చాలని వేతనాలతో బతుకీడుస్తున్నామని వారి కుటుంబాలకు కూడా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో మున్సిపల్ కార్మికులు, అంగన్వాడీ, ఆశా కార్యకర్తల పిల్లలకు సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి మొండి చేయి చూపడం దారుణమన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులతో పాటు స్కీం వర్కర్లందరికీ కూడా తల్లికి వందనం తో పాటు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు లక్ష్మీదేవి, మంజుల, శివమ్మ, శంకర, రాజు పాల్గొన్నారు.



మదనపల్లె : నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

'తల్లికి వందనం'లో కోత పెట్టడం దుర్మార్గం

- సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎన్నికల ముందు ఎన్నికల్లో సిఎం చంద్రబాబు వాగ్దానం చేసినట్లుగా 'తల్లికి వందనం' నగదును అర్హులైన విద్యార్థులందరికీ అందచేయకుండా నిబంధనల పేరుతో కోత పెట్టడం దుర్మార్గం అని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడ్డగోలు నిబంధనలతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 9 లక్షల కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. ఆదాయ పరిమితిని సడలించి గ్రామాల్లో రూ.2.5 లక్షలు, పట్టణాల్లో రూ.3 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాల న్నింటికీ తల్లికి వందనం వర్తింప జేయాలని, ఆదాయంతో నిమిత్తం లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే వారందరికీ వేయాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్స్, వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. గత ప్రభుత్వం విధించిన షరతులను నాడు విమర్శించిన కూటమి నేతలు నేడు అంతకుమించిన షరతులు పెట్టి లబ్ధిదారులతోపాటు నగదును కూడా తగ్గించడం సరికాదన్నారు. రూ.15వేలు నేరుగా తల్లులకు చెల్లిస్తామని, ఇప్పుడు రూ.2వేలు మినహాయించారని అన్నారు. కుటుం బంలో ఎంతమంది పిల్లలున్నా ఇస్తామని చెప్పి, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పొందుతున్న కుటుం బంలోని విద్యార్థులకు ఈ పథకం అమలు కాకుండా మినహాయించడం హామీని ఉల్లంఘించమడేనన్నారు. ఇంత వరకు ఫీజురీయంబర్స్‌మెంట్ ఎవరికీ ఇవ్వకుండానే ఆ పేరుతో తల్లికి వందనంపై కోత విధించడం అన్యాయ మన్నారు. విద్యాహక్కు చట్టం కింద ప్రయివేట్ స్కూళ్లలో చదువుతున్న వారి తల్లులకు కాకుండా నేరుగా స్కూళ్ల మేనేజ్‌మెంట్‌ల ఖాతాలకు చెల్లించడంలోని ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. గ్రామ వార్డు సచివాలయాలలో వచ్చే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించి అర్హులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.


నిందితుల అరెస్టును చూపుతున్న డిఎస్‌పి మహేంద్ర

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.20 లక్షల విలువ చేసే నగలు, నగదు స్వాధీనం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తాళం వేసి ఉన్న ఇళ్లలను లక్ష్యం చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను శనివారం మదనపల్లె రూరల్, ముదివేడు పోలీసులు, క్రైమ్ పార్టీ సిబ్బంది అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 20లక్షల విలువ గల నగలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురు నిందితులను స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో అరెస్టు చూపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మహేంద్ర మాట్లాడుతూ మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న దొంగతనాల కేసులను ఛేదించే క్రమంలో క్రైమ్ పార్టీ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో మదనపల్లి మండలం, వేంపల్లికి చెందిన షేక్ మౌలాలి, కర్ణాటక రాష్ట్రం, చింతామణి తాలూకా, బూరగమాకుల పల్లెకు చెందిన ఎం.శంకర, కురబలకోట మండలం, నంది రెడ్డిగారిపల్లె పంచాయతీ, గౌనువారిపల్లికు చెందిన పాలెం నర్సింహులు, మదనపల్లె మండలం, కోటవారిపల్లి పంచాయతీ, పాకాలవారిపల్లెకు చెందిన వరగాని నవీన్ కుమార్, కురబలకోట మండలం, తెట్టు పంచాయతీ, చింతమాకుల పల్లెకు చెందిన అనంత విశ్వనాథ్ రెడ్డి, చిత్తూరు జిల్లా, గంగవరం మండలం, మాడుగురు ప్రాంతానికి చెందిన నేరేటి రమేష్ అంగళ్లు సమీపంలోని చేనేత నగర్ వద్ద అనుమానితంగా తిరుగుతుండడంతో అదుపులోకి తీసుకుని విచారించడం జరిగిందన్నారు. విచారణలో ఆరు చోట్ల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, 762 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.5.28 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిలో మౌలాలిపై బీ.కొత్తకోట పోలీస్ స్టేషన్లో రెండు ఎర్రచందనపు కేసులు ఉన్నాయని, నవీన్ కుమార్ పై తాలూకా పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు ఉందని, అనంత విశ్వనాథ్ రెడ్డి పై ముదివేడు పోలీస్ స్టేషన్లో అక్రమ మద్యం కేసు ఉందని తెలిపారు. శంకర్ కర్ణాటక ఆర్‌టిసిలో డ్రైవర్ కమ్ కండక్టర్ గా ప్రస్తుతం పనిచేస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆరుగురు నిందితులు జల్సాలకు, ఈజీ మనీకి అలవాటు పడి టీ దుకాణంలో కలుసుకొని ప్రణాళికతో చోరీలకు తెగబడినట్లు తెలిపారు. ముఖ్యంగా తాళం వేసిన ఇళ్ళను రెక్కి నిర్వహించి, పట్టపగలే చోరీలకు పాల్పడడం వీరి నైజమ న్నారు. ఇలాంటి చోరీలకు పాల్పడే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండా లని డిఎస్‌పి సూచించారు. ఇంటిల్లిపాది ఎక్కడైనా ఊరు వెళ్లాలనుకుంటే పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల ఆ ప్రాంతంలో గస్తీని ముమ్మరం చేసి, చోరీలు అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రూరల్ సిఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్‌ఐ దిలీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. చోరీ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన క్రైమ్ పార్టీ సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

20 నుంచి పాలిసెట్-25 కౌన్సెలింగ్

ప్రజాశక్తి - చాపాడు

పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబం ధించిన కౌన్సెలింగ్ షెడ్యూలును ఎపి సాంకేతిక విద్యాశాఖ వెల్లడించిందని మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈనెల 20 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుందని తెలిపారు. కౌన్సిలింగ్‌కు సంబంధించిన ప్రాసెసింగ్ ఫీజును ఆన్‌లైన్ విధానంలో చెల్లించడానికి ఈనెల 20 నుండి 27వ తేదీ వరకు అవకాశం ఉంటుందన్నారు. ఫీజు ఓసి, బిసిలకు రూ.700, ఎస్సీ, ఎస్టీలకు రూ.250 చెల్లించాలన్నారు. పాలిసెట్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేపట్టనున్నారన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు ఫీజు చెల్లించిన రశీదు, పాలిసెట్ హాల్ టిక్కెట్, ర్యాంక్ కార్డు, పదో తరగతి ఉత్తీర్ణత ధృవపత్రం, బదిలీ ధృవపత్రం, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, అర్హులైన వారికి ఇడబ్ల్యుఎస్, ఆదాయ ధృవపత్రం, ప్రత్యేక కేటగిరీ పత్రాలను సమర్పించాలన్నారు. ఈనెల 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించారన్నారు. వెబ్ ఆప్షన్లను మార్చుకునేందుకు గడువును జూలై ఒకటిగా నిర్ణయించారని, జూలై 3న సీట్లను కేటాయించనున్నారన్నారని ఆయన వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు సంబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ లేదా ఆన్‌లైన్ విధానం ద్వారా రిపోర్టు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్

- నిరసనలో సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

దండకారణ్యంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ఆపరేషన్ కగార్ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుందని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. శనివారం రాయచోటి తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిరసన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ దేశంలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్లకు దోచిపెట్టడానికి ఆపరేషన్ కగార్ ఏర్పాటు చేయడం జరిగిందని అడవుల్లో ఉన్న ఆదివాసీలను బలవంతంగా ఖాళీ చేపించి వారిని చంపి అక్కడ ఉన్న ఖనిజాన్ని తీసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం పథకం ప్రకారం మానవహ రనానికి పాల్పడుతుందని పేర్కొన్నారు. ఆదివాసీలకు గిరిజనులకు బహుజన సమాజానికి అండగా ఉన్న మావోయిస్టు పార్టీని అంతమొందించడానికి దేశ సైన్యం, పోలీసులతో బాంబుల వర్షం కురిపిస్తుందని ఇలా చేయడం అమానుషమని పేర్కొన్నారు. మావోయిస్టులతో వెంటనే శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం పథకం ప్రకారం దేశవ్యాప్తంగా తన రాజకీయ స్వలాభావం కోసం, అధికారం కోసము ప్రత్యర్థి రాజకీయ నాయకులపై అనేకమైన అక్రమ కేసులు బనాయించి జైలలోకి పంపుతున్నారని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ అజెండాను అమలుపరుస్తూ రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ దేశ సంపదను కాపాడుతున్న మూలవాసులైన ఆదివాసీలను వారికి అండగా ఉన్న మావోయిస్టులను కూంబింగల పేరుతో అడవులపై డ్రోన్లతోనూ బాంబుదాడులు చేస్తూ తన దేశ ప్రజలపైనే యుద్ధం చేయడం అనాగరికమని పేర్కొన్నారు. వెంటనే ఆదివాసీలతోనూ మావోయిస్టు పార్టీతోనూ శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఆదివాసి నివాస ప్రాంతాలలో ఉన్న మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు అని చూడకుండా వారిపై హత్యలు మహిళలపై అత్యాచారాలు చేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని ఇది మానవ విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని తుట్లు పొడుస్తూ మనస్మృతిని ప్రవేశపెట్టడానికి మనస్మృతి పేరిట బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు భారత రాజ్యాంగాన్ని రద్దు చేయాలని ఆలోచనతో ఈ విధంగా బహుజనులైన పేద వర్గాలపై దాడులు చేయడం ఆక్షేపనీయమని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాలలో ఏదైనా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలంటే షెడ్యూల్ 5, పైసా చట్టాన్ని అమలు పరచాలని దండ కారణ్యంలో నిర్వహించి ఉన్న సైన్యాన్ని వెంటనే అడవుల నుండి వెనక్కి రప్పించి శాంతియుత వాతావరణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, గిరిజన సమాఖ్య నాయకులు విశ్వనాథ్ నాయక్, అంబేద్కర్ సంగం నాయకులు చంద్రశేఖర్, అంబేద్కర్ సేన నాయకులు పల్లం తాతయ్య, బంజారా సంఘం నాయకులు శంకర్ నాయక్ ఎరుకల హక్కుల సంఘం నాయకులు సహదేవుడు, బిసి నాయకులు అందేలా రమణ, సిపిఎం నాయకులు రామాంజులు, బసిరెడ్డి, మాధవయ్య, నరసింహ, డి.సి.వెంకటయ్య, రెడ్డెయ్య, ఈశ్వరయ్య, రామచంద్ర, వెంకటరమణ, ప్రజాతంత్ర వాదులు నాగార్జున, శివన్న, సిద్దేశ్వర, పెద్ద సంఖ్యలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



నిరసన తెలుపుతున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే



డ్రైనేజీ కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లి

పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బెంగళూరు బస్టాండ్ కూడలిలో డ్రెయినేజీ కాలువలను ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో కలిసి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ పట్టణంలోని కాలువల నిర్వహణ, నాళాల శుభ్రత, మురుగునీటి నిల్వ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రజలకు సమస్యలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంగా చెప్పారు. పట్టణ శుభ్రతే తమ లక్ష్యమని అన్నారు. ఎక్కడ కూడా డ్రెయినేజీ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు కూడా పారిశుధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. ఇంటిలోని వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్త వేరు చేసి మున్సిపల్ కార్మికుల అందివ్వాలని కోరారు. స్వచ్ఛ మదనపల్లికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు పాల్గొన్నారు.

16న ధ్రువీకరణకు తుది అవకాశం

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్‌ఐటిల్లో సీటు పొందేందుకు ప్రత్యేక కేటగిరీ కింద దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 16న నూజివీడు క్యాంపస్‌లో ధ్రువీకరణ పత్రాలను పరిశీలన చేసేందుకు తుది అవకాశం కల్పించినట్లు అడ్మిషన్ల కన్వీనర్ అమరేంద్ర సంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీయూకేటీ ఎపికి సంబంధించి 2025-26 విద్యాసంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బిటెక్ కోసం దరఖాస్తు గడువును 2025 జూన్ 2 నుండి 10వ తేదీ వరకు పొడిగించారన్నారు. ఆ గడువులో క్యాప్, క్రీడలు, ఎన్‌సిసి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి ప్రత్యేక కేటగిరీలకు దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్ ధ్రువీకరణ కార్యక్రమాన్ని ఈనెల 16న సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జిల్లాలో లక్ష గృహాలకు సోలార్ రూఫ్ టాప్ లక్ష్యమని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. మండల పరిధిలోని మోరగుడి గ్రామ ప్రజలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం అనేక ప్రోత్సాహలతో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు నిర్దేశాలు సులభతరం చేశామన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుకు బ్యాంకర్ల సహకారాలు మెండుగా ఉన్నాయన్నారు. సిబిల్ స్కోర్‌ను బట్టి బ్యాంకులు రుణాలు వేగవంతంగా ఇస్తారన్నారు. ఒక్క కిలో వాట్ కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్తు, అదే రెండు కిలోవాట్ల కెపాసిటీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల ఉత్పత్తి చేస్తుందన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పొంది సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజగోపాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు రజినీకాంత్ రెడ్డి, ఈశ్వర్, మోరగుడి ప్రజలు పాల్గొన్నారు.

ఏడాదిలోనే చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ఇచ్చిన హామీలను అమలు చేయలేక చేతులెత్తేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం పథకంలో రూ.2 వేలు కోత పెట్టడం దుర్మార్గమని అన్నారు. మదనపల్లె మెడికల్ కాలేజ్, మదనపల్లి జిల్లా, బిటి కళాశాలను యూనివర్సిటీ, కడప-బెంగుళూరు రైల్వే లైన్ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఏడాది పాలనలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో అన్నదాత సుఖీభవ ఎప్పుడని నీలదీసారు. మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయడానికి ఏడాది సరిపోలేదా అని ప్రశ్నించారు. చేతగాని కూటమి ఎన్నికల హామీలు పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. రాష్ట్రంలో కేవలం పోలవరం, రాజధాని రెండే కాదని ప్రజలకు ప్రతిఒక్కటీ అవసరమేనని, పాలకులు రాష్ట్రంలో ఉన్న అన్ని సమస్యలపైనా దృష్టి సారించాలన్నారు. మదనపల్లె ను జిల్లా గా ప్రకటించి, మెడికల్ కళాశాలను తొందరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న రెడ్డిసాహెబ్

ప్రోత్సాహకరం

ప్రజాదృష్టి

ప్రభుత్వం ప్రొద్దుటూరును బంగారు తయారీ కేంద్రంగా మార్చుతామని ప్రకటించడం ప్రశంసనీయం. దేశంలోనే రెండవ ముంబయిగా ప్రసిద్ధిగాంచిన ప్రొద్దుటూరు పట్టణాన్ని ఎంఎస్‌ఎంఇల తరహాలో పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్, డిఐసి, ఎపిఐఐసి అధికారుల సమావేశంలో ప్రణాళికలు రచించడం అపురూపం. ఇటువంటి ప్రోత్సాహకర ప్రయత్నాలు చేయడం ఉత్సాహాన్ని నింపుతోంది. జిల్లాలో జెఎస్‌డబ్ల్యూ రెండు దశల్లో రూ.తొమ్మిది వేల కోట్లతో ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులు చేపట్టతామని ప్రకటించడం తెలిసిందే. రాష్ట్రంలోని కూటమి సర్కారు నాయకత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉంది. ఇటువంటి ప్రయత్నం ద్వారా సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే రాయలసీమ వాసులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రుణాన్ని తరాల తరబడి తీర్చుకోని రీతిలో బ్రహ్మరథం పట్టే వారని చెప్పవచ్చు. రాజకీయంగానూ టిడిపికి తిరుగులేకుండా ఉండేది. రాయలసీమ రూపురేఖలు మారిపోయి ఉండేవి. దేశంలోనే రాయల సీమ వెనుకబడి ప్రాంతమని పేరు సైతం తొలగిపోయేది. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎంఎస్‌ఎంఇ పార్కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో సందేహం తొలగిపోయింది. రూ.250 కోట్ల వ్యయంతో దేశ పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా టెక్ విద్యార్థులను తీర్చిదిద్దడం ఆహ్వానించాల్సిన విషయమని గ్రహించాలి. రాయలసీమ నుంచి గల్ఫ్‌కు వెళ్లే వలసలను నిరోధించే అవకాశంలో మొదటి అడుగు పడేది. రెండవ అడుగు జిల్లాలో ఉక్కు పరిశ్రమ ప్రారంభమైతే వలసలు నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉంటుందని చెప్ప వచ్చు. గండికోట ఆవరణంలో టెంట్‌సిటీ ఏర్పాటు చేయనుండడం ఉత్సాహాన్ని కలిగిస్తోంది. పర్యాటక ప్రాజెక్టును గ్రాండ్‌కెనాన్ తరహాలో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. 2014-19 టిడిపి ప్రభుత్వ హయాంలో రూ.500 కోట్లతో పర్యాటకాభివృద్ధి చేపడతామని ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. 2024-29 పీరియడ్‌లో గండికోటను గ్రాండ్‌కెనాన్ తరహాలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం, గండికోటను గ్రాండ్‌కెనాన్ తరహాలో అభివృద్ధి, ఎంఎస్‌ఎంఇ పార్కు, హార్టికల్చర్‌హబ్, ఫ్రూట్ బాస్కెట్ తీర్చిదిద్దుతామనే హామీలను అమలు చేస్తే జిల్లా ప్రజానీకం టిడిపికి బ్రహ్మ రథం పడతారనడంలో సందేహం లేదు. హామీల అమలుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాల్సిన అవసరం ఉంది. ఏటా జిల్లా పురోగతిపై సమీక్షించుకుని అభివృద్ధి వేగవంతానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

చిత్తూరు, అనంతపురం జట్ల ఘన విజయం

ప్రజాశక్తి - కడప

సౌత్‌జోన్ ఎసిఎ అండర్-19 వన్డే క్రికెట్ టోర్నీలో శనివారం జరిగిన మ్యాచుల్లో చిత్తూరు, అనంతపురం జట్లు ఘన విజయం సాధించాయి. ఎసిఎ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 110 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 46.2 ఓవర్లలో 237 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సి.సోహన్‌రెడ్డి అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించాడు. 119 బంతు లను ఎదుర్కొని 15 బౌండరీల సహాయంతో 110 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని భార్గవ్ మహేష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకు న్నాడు. తోషిత్ యాదవ్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 238 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 31.5 ఓవర్లలో 127 పరు గులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. ఆ జట్టులోని షావుల్ హమీద్ 60 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని ధనుష్‌రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. **కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో** జరిగిన వేరొక మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై 110 పరుగుల తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు 50.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 283 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఎస్. రెహాన్ బ్యాటింగ్ లో అదుతేంగా రాణించాడు. 104 బంతులను ఎదుర్కొని 16 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 117 పరుగులు చేశాడు. కర్నూలు జట్టులోని నౌసున్ కళ్యాణ్ 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 284 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు 31.3 ఓవర్లలో 173 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమిని చవిచూసింది. ఆ జట్టులోని కె.వి.ఓంకార్ 57 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని నిశ్చయ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మరో బౌలర్ సాయి ప్రతాప్ రెడ్డి అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు.


తలపడుతున్న చిత్తూరు, నెల్లూరు జట్లు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలి

ప్రజాశక్తి-నందలూరు

ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. ఆడపూరు గ్రామంలో శనివారం ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన దారులు సరైన ధ్రువపత్రాలను తప్పక కలిగి ఉండాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడినచో వాహనాలను సీజ్ చేసి, వాహన యజమానుల రద్దు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-కలకడ

విద్యుదాఘాతంతో మృతి చెందిన వానరానికి అంత్యక్రియలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎర్రకోట పల్లి పంచాయతీ పాపిరెడ్డిగారిపల్లి గ్రామంలో ఉన్న మహేంద్ర పక్కన విద్యుత్ స్తంభాల పైన వానరములు పోతుండడంతో అందులో ఒకటి విద్యుత్ షాకానికి గురై కిందపడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని హిందూ, ముస్లింలు ఏకమై మృతి చెందిన వానరముకు అంత్యక్రియలు ఘనంగా అంత్యక్రియలను నిర్వహించినట్లు తెలిపారు. మేళ తాళాల మధ్య హిందూ, ముస్లింలు కలిసి పాడెమోసి గ్రామస్తులు తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

బి.కొత్తకోట తహశీల్దార్‌గా బావాజాన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట



బాధ్యతలు స్వీకరిస్తున్న బావాజాన్

మండల తహశీల్దార్‌గా బావాజాన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గుర్రంకొండలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న ఈయనకు ఉద్యోగోన్నతి లభించింది. ఈ సందర్భంగా బావా జాన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా మండ లంలో రెవెన్యూ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజల అర్జీలను స్వీకరి స్తూ వారి సమస్యలపై విచారణ జరిపి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు సైతం తమకు సహకరించాలని వారి వద్ద ఉన్న ఆధారాలతో వస్తే సత్వర న్యాయం అందించేందుకు కృషిచేస్తామని చెప్పారు. మండల పరిధిలో ఆక్రమణలపై దృష్టి సారించి తొలగిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైసిపి మండల అధ్యక్షులుగా ధ్వజారెడ్డి

ప్రజాశక్తి -రైల్వేకోడూరు



వైసిపి మండల అధ్యక్షులుగా రామిరెడ్డి ధ్వజారెడ్డిని ఆ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నియామక పత్రాన్ని విడుదల చేసింది. ఈ సందర్భంగా ధ్వజారెడ్డి మాట్లాడుతూ వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షులుగా నియమించారని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. గత రెండు పర్యాయాలు సాధారణ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం కోసం ఎంతో కృషి చేశానని అన్నారు.



తాగునీటి బోరు డ్రిల్లింగ్ చేస్తున్న కూలీలు

తాగునీటి సమస్య పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలిపారు. శనివారం మండలంలోని మసీదు దగ్గర, ఈడిగపల్లెలో తాగునీటి బోరు డ్రిల్లింగ్ చేయగా రెండు బోర్లలో నీరు పుష్కలంగా వచ్చాయని అన్నారు. మండల ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతుంటే, ఈ విషయాన్ని జగన్ మోహన్ రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతో వెంటనే స్పందించి కుటుంబ ప్రభుత్వం తరపున తాగునీటి బోరు వేయడం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. అన్నారు. గ్రామాల్లో సమస్య ఉంటే జగన్మోహన్‌రాజు దృష్టికి తీసుకెళితే వెంటనే పరిష్కారం లభిస్తోందని అన్నారు.

జాతరకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని ఈస్ట్ పేటలోని శ్రీనల్ల గంగమ్మ జాతర నిర్వహణకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. శనివారం వైసిపి మండల కన్వీనర్ చౌడేశ్వర్ , నాయకులు అనగదును గ్రామస్తులకు అందించారు. జాతర నిర్వహణకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి దాతృత్వాన్ని హర్షిస్తూ గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కరీం, జమాల్ బాషా, నాయకులు రామ్మూర్తి, షాదిక్, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి



మాట్లాడుతున్న ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి

మండలంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నూతన ఎస్ఐ ఉమామహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. శని వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడిన ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తించిన కఠిన చర్యలు తప్పవని అన్నారు. అందరి సహకారంతో మండలంలో శాంతిభద్రతలు కాపాడడంతో పాటు శాంతి సమాజా ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. సాయంత్రం కురవపల్లి బస్ స్టాప్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానా విధించారు.

యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం



యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

యోగాతో మానసిక ఉల్లాసం సాధించవచ్చుని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ తప స్విని, హెచ్ఎం అంజాద్ అలీఖాన్ పేర్కొన్నారు. శనివారం హెచ్ఎం అంజాద్‌అలీ ఖాన్ ఆధ్వర్యంలో జడ్‌పి హైస్కూల్(తెలుగు) క్రీడా మైదానంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో కొమ్మిరెడ్డిగారిపల్లెలోను, ఎంపి డిఒ ఆధ్వర్యంలో నిమ్మనపల్లిలో, అన్ని పంచాయతీ పరిధిలో వివిధ శాఖ అధికారులు పంచాయతీ కార్య దర్శుల ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సాధారణమైన యోగా ఆసనాలను ప్రతిరోజు చేయా లన్నారు. యోగా సాధన ద్వారా ఆరోగ్యంగాను, మానసిక ఉల్లాసంతోను మనసు ప్రశాంతంగా ఉంటు ందని, శ్వాసకోశ సంబంధ వ్యాధులు దూరం అవుతాయని అన్నారు. జూన్ 21వ తేదీన నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా జరపడానికి ప్రజలందరూ యోగాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జయప్రకాష్‌రెడ్డి, టిడిపి రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతి నిధి ఆర్జే వెంకటేష్, ఎఒ రమేష్‌బాబు, ఆర్ఐ రమేష్, డాక్టర్ ప్రత్యూష, ఎంఇఒలు పద్మావతి, నారాయణ, పిఇఒ టిలు భద్రయ్య, రమణప్ప, వెంకట గోపాల్, పంచాయతీ కార్యదర్శులు, అన్ని శాఖల సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **రామాపురం :** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన యోగాంధ్రలో మన వంతుగా భాగ్య స్వాములం అవుదామని మండల ప్రత్యేక అధికారి విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో చేపట్టిన యోగాసనా శిక్షణ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న తనం నుంచి యో గాసనాలు చేయడం వల్ల శారీరకంగా దృఢంగాను చదువు పట్ల ఏకాగ్రత పెరిగి శారీరకంగా దృఢంగా ఉండవచ్చునని అన్నారు. కార్యక్ర మంలో ఎంపిడిఒ జాషువా, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఇఒ2 జయచంద్ర, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు. 13 పంచాయతీల కార్యదర్శులు, మోడల్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** ప్రతి రోజూ యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి దూరం చేసుకోవచ్చని అందుకే ప్రతి ఒక్కరు కనీసం ఉదయం కొద్దిసేపైనా యోగా చేయాలని కొత్త బోయినపల్లి ఎస్.జె.ఎస్.ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయులు భారతి అన్నారు. పాఠశాలలో యోగా ఆసనాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, పి.జనార్దన్, బి.శేషగిరి, ఎస్.వి.రామరాజు, శివప్రసాద్‌గౌడ్, యస్.ప్రభాకర్ రావు, యం.చెన్న కేశవులు, పి.విజయబాస్కర్, శ్రీరాములు పాల్గొన్నారు.

వెలుగు ప్రత్యేక పాఠశాలలో యోగా సభ

మదనపల్లె అర్బన్ : పట్టణంలోని అమ్మచెరువుమిట్టలో గల వెలుగు ప్రత్యేక పాఠశాలలో సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో విబిన్న ప్రతిభావంతుల యోగా సభ నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు,జిల్లా అధ్యక్షులు ఎన్.మునిగోపాలకృష్ణ, బి.టి కళాశాల మాజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, డైట్ కళాశాల రిటైర్డ్ ప్రొఫసర్ శ్రీనివాసులు, రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.ధనలక్ష్మి, బొమ్మనచెరువు పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ మహమ్మద్ పురఖాన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 21వ తేదీ నుంచి ఈనెల 21 వరకు యోగాంధ్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధాత్రి ఫౌండేషన్ వారి అక్షయ ధాత్రి ఎగువ కురవంక స్టడీ సెంటర్ టీచర్స్, విద్యార్థులు, వెలుగు కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి,ప్రిన్సిపల్ పి.లీనాకుమారి,సోషల్ వర్కర్ యం.గీత, వార్డెన్ స్వీటీ, వెలుగు సిబ్బంది, వృద్ధులు, చిన్నారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-గాలివీడు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 108 పైలెట్ రామాంజులు, సింగపూర్ ఆచారి అధ్యక్షతన దీప బ్లడ్ బ్యాంక్ రాయచోటి వారి సహకారంతో గాలివీడు గేటు వద్ద ఉన్న ఆయుష్ చిన్నపిల్లల ప్రాంగణంలో డాక్టర్ యం,మహేష్ నాయక్ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాలివీడు ఎస్ఐ రామకృష్ణ పాల్గొని రక్తదాని శిబిరాన్ని ప్రారంభంచారు. దాదాపు 45 మంది రక్తదాతలు రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం దొరక్క ప్రాణాలు కోల్పోతున్న చాలామంది నిస్సహాయకులను మనం రోజు చూస్తూనే ఉన్నామని అన్నారు. అలాంటివారికి మన చేతనైన సహాయంగా రక్తదానం చేసి చేయించి పరోక్షంగా తెలియని వారిని కూడా ఆదుకోవడంలో ఇది ఒక గొప్ప బృహత్ కార్యమని పేర్కొన్నారు. యువత ముందుకు వచ్చి సహాయాన్ని ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేయాలని ప్రోత్సహించారు. ఇంతటి మహా కార్యక్రమానికి నీరాజనం పట్టిన పైలట్ రామాంజులుకు, సింగపూర్ ఆచారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, చిన్న పిల్లల ఆస్పత్రి యాజమాన్యం మహేష్ నాయక్, అర్చనకలశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.మౌలాలి, సిబ్బంది, రక్త దాతలు పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్రంలో తల్లుల కోసం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి అభినందనలు తెలుపుతూ టిడిపి కార్యాలయంలో ఘనంగా సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మండల మహిళ టీడీపి నాయకులు సుజాత,అంజలి పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.పథకం అమలుతో తల్లుల ఆర్థిక స్థితి మెరుగవుతుందని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బురద జల్లడమే వైసిపి పని

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రభుత్వంపై బురద జల్లడమే వైసిపి వారికి పనిగా మారిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక నెహ్రూ రోడ్డులోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తూ కేంద్ర ప్రభుత్వ సహాయంతో పోలవరం, అమరావతి పూర్తి చేయడంతోపాటు నూతన రైల్వేజోన్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. ఓర్వలేక వైసిపి నాయకులు బురదజల్లే పనిలో నిమగ్నమయ్యారని తప్పుపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫించన్లు రూ.4000 పెంచి చెప్పిన మాట ప్రకారం బకాయితో పాటు అందించిందన్నారు. మెగా డీఎస్సీ కూడా విడుదల చేసిందన్నారు. తల్లికివందనం ఎంత మంది పిల్లలుంటే అంతమందికి అమలు చేసిందని వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయ రెడ్డి, టిడిపి నాయకులు పోసా భాస్కర్, గాలి పోతుల సుదర్శన్ పాల్గొన్నారు.



ముళ్ల పొదలను తొలగిస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతుల పనులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక పట్టణంలో విద్యుత్ శాఖ సిబ్బంది ముమ్మరంగా మరమ్మ తుల పనులు చేప ట్టారు. ఎఇ సురేంద్ర, సబ్ ఇంజినీర్ శేషు ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద పెరిగి పోయిన చెట్ల కొమ్మలు, ముళ్ల పొదలను తొలగించారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపట్టి పాడైన వాటిని తొలగించారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడకుండా జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

విగ్రహాలను ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - వేముల : రాయలసీమను పరిపాలించిన వారి విగ్రహాలను ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి కేంద్ర గ్రామీణ అభివృద్ధి, టెలికం కమ్యూనికేషన్ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరారు. ఆ మేరకు పేర్ల పార్థసారథిరెడ్డి శనివారం విజయవాడలో మంత్రి కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ గండికోట అభివృద్ధి రాయలసీమకే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తల్లికి వందనంపై తప్పుడు ప్రచారం తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తల్లికివందనం పథకంపై వైసిపి బులుగు విషం కక్కుతోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికివందనం పథకంలో ఒక్కో విద్యార్థికి రూ.15వేలు ప్రభుత్వం ఇస్తా ఉంటే వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. రూ.2000 లోకేష్ జోబులోకి పోయాయంటూ దిగజారుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. వైసిపి పాలనలో రూ.13వేలు ఇచ్చి మిగతా రూ.2,000 జగన్ జోబుల్లోకి పోయాయా లేదా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరాయా అని ప్రశ్నించారు. జగన్ పాలనలో 42 లక్షల మందికి అమ్మఒడి ఇస్తే, కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు తల్లికివందనం ఇస్తోందన్నారు. సమావేశంలో యూత్ నాగేశ్వర్‌రెడ్డి, జంబాపురం వెంకట రమణారెడ్డి, పొన్నతోట శీను, నాగేంద్ర, దువ్వూరు మురళి, పాలూరు సుధీర్‌రెడ్డి, మోరగుడి విశ్వనాథరెడ్డి, కూటమి నేతలు పాల్గొన్నారు.

పంటల సాగుతో రైతుకు ఆదాయం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్ : ప్రకృతి వ్యవసాయం విధానంలో ప్రధాన పంటతోపాటు పలు రకాల అంతర పంటలు, బయో డైవర్సిటీ పంటలు వేయడం వల్ల రైతుకు ఆదాయంతోపాటు నేలలోని సూక్ష్మజీవులకు సరైన పోషకాహారం అందుతుందని డిపిపి కరీమున్నీసా తెలిపారు. శనివారం మండల పరిధి లోని పి.బొమ్మేపల్లి, అంబవరం గ్రా మాల్లో పనిచేస్తున్న మెంటార్ ఇం టర్న్, మెంటార్ పొలాలను ఆమె పరి శీలించారు. ఈ సందర్భంగా జనవరి నుండి మే వరకు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్వయంగా ఫీల్డ్‌లోకి వెళ్లి ఏటీఎం, ఏ గ్రేడ్‌లలో ఉన్న పం టలను పరిశీలించారు. పర్యవేక్షణలో వైఆర్ఎఫ్ మహే శ్వరి, బొమ్మేపల్లి మెంటార్ ఇంటర్న్ పి.నాగరాజు, అంబ వరం మెంటార్ ఎన్.లక్ష్మీదేవి, పెద్దముడియం మండలం ఫార్మర్ సైంటిస్టులు సురేష్, నాగ పుల్లయ్య పాల్గొన్నారు.

స్కూల్ జోన్ వద్ద జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలి

- విద్యార్థి, యువజన సంఘాలు నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

ప్రొద్దుటూరు పట్టణంలోని మోడం పల్లె బైపాస్‌లో శ్రీచైతన్య హైస్కూల్ పక్కన ఉన్న ఎర్రగుంట్ల రోడ్డులో విద్యార్థులు, వృద్ధులు తిరుగుతూ ఉంటారని, ఆయా ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని పిఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కత్తి, యన్‌డిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, నేషనల్ ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎరుకల ప్రసాద్ ఆర్అండ్‌బి అధికారులను కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన నాయకులు అశోక్, రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఎడ్లచే బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - ఖాజీపేట : మండల పరిధిలోని తవ్వారుపల్లెలో శ్రీవీరాంజనేయ స్వామి ఆల య 8వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ఎడ్లచే బండ లాగు డు పోటీలు ఆకట్టుకున్నాయి. ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభి షేక కార్యక్రమాలు ప్రధాన అర్చకులు మధుశర్మ ఆధ్వర్యంలో నిర్వ హిం చారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దలు అన్న ప్రసాద వితరణ చేశారు. బండలాగుడు పోటీలను చూసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ చైర్మన్ సందుల నాగశివారెడ్డి బండలాగుడు పోటీలను ప్రారంభించి, గెలు పొందిన ఎడ్ల యజమానులకు బహుమతులను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

బేషరతుగా అమలు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె : కూటమి ప్రభుత్వం విద్యార్థుల చదువులకు ఇస్తున్న తల్లికివందనం పథకంలో కోతలు కోయవద్దని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి సూచిం చారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం తల్లికివందనం హామీని అమలు చేయడం హర్షణీయమన్నారు. ఆ పథ కానికి పెట్టిన షరతులు, నిబంధనలతో దాదాపు 9 లక్షల మంది విద్యార్థులు అర్హతను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి షరతులతో నిమిత్తం లేకుండా తల్లికివందనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు షరతులు లేకుండా అమలు చేయాలని కోరారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ పొందే కుటుంబాలలోని విద్యార్థులకు వర్తించకపోవడం సమంజసం కాదన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉన్నత విద్యకు, తల్లికివందనం పాఠశాల, ఇంటర్ విద్యకు సంబంధించిందని తెలిపారు.



బురద నీటితో నిండిన ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణం

వర్షం వస్తే బస్టాండ్‌లో అడుగు పెట్టలేం

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రం గాలివీడులోని ఆర్‌టిసి బస్టాండ్‌లో వర్షం వస్తే అడుగు పెట్టలేమని ప్రయాణికులు, స్థానిక ప్రజలు పేర్కొన్నారు. చిన్నపాటి వర్షానికి బురద మాయమైపోయి వర్షం నీటితో నిండిపోయి ఇబ్బందిగా మారుతుందని చెబుతున్నారు. బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా బురద నీటి లో కాలు పెట్టాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ ముందుభాగం ప్లాట్‌ఫాం వేస్తే సమస్య లేకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఆర్‌టిసి సిబ్బందికిగానీ, ప్రయాణికులు గానీ సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దృష్టి పెట్టి సిసిరోడ్డు, ప్లాట్‌ఫాం చదును చేస్తే బస్టాండ్ అభివృద్ధి దిశగా ముందుకు వెళుతుందని అన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రాయచోటి

అన్నదానం గొప్పదని లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ అధ్యక్షులు లయన్ పి.శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో ఎస్ఎన్ కాలనీలో నివాసమున్న కీ.శే.చంద్రావతి పదవ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర ఆర్థిక సహాయంతో చిత్తూరు రోడ్డులో గుడిసెలలో నివసించే పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం దాత డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్‌చంద్ర మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే అన్న దాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, వినోద్ కుమార్ నాయక్, భాను ప్రకాష్ పాల్గొన్నారు.

యంగ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

బి.కొత్తకోట : యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ బెంగుళూరు శబరి ఆశ్రమంలోని ధనుంజయ, శైలజల కుమార్తె హేత్విక పుట్టినరోజుని పురస్కరించుకొని వంద మంది వృద్ధులు, చిన్నారులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేయడం జరిగిందన్నారు. వైదేహి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ చిన్నారికి రక్తం అవవసరం కాగా ఫౌండేషన్ సభ్యుడు అశోక్ రక్తదానం చేయడం జరిగిందన్నారు. సేవా కార్యక్రమాలలో తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు రాజాబాబు, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, అనిల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పేదలకు ఆహారాన్ని అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

క్రైం కార్నర్



విలేకర్ల ఎదుట నిందితులను ప్రవేశపెట్టిన సిఐ, ఎస్ఐ

వ్యక్తిపై దాడి : నలుగురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని గాదెల పంచాయతీలోని తళ్లెంవారిపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న రాజగోపాల్ రెడ్డి అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు ఎస్ఐ మహేష్ నాయుడు తెలిపారు. తళ్లెంవారిపల్లి గ్రామానికి చెందిన రాజగోపాల్ రెడ్డికి ఇదే గ్రామానికి చెందిన కొలవల శ్రీధర్ రెడ్డి, కొలవల అమర్నాథ్ రెడ్డి, కొలవల వంశీధర్ రెడ్డి, కొలవల ప్రభాకర్ రెడ్డి అనే వారికి భూతగాదాలు ఉండేవని, అన్నారు. ఈనెల 13న భూ తగాదాల విషయంపై నలుగురు కలిసి రాజగోపాల్‌రెడ్డిని హత్య చేయాలనే ఉద్దేశంతో కట్టెలతో అతనిపై దాడి చేశారని తెలిపారు. రాజగోపాల్ రెడ్డి తల, శరీరంపై రక్త గాయాలు కావడంతో గ్రామస్తులు అతనిని రక్షించి పోలీస్ వారికి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. హుటాహుటిన తన సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లి రాజగోపాల్‌రెడ్డిని రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. రాజగోపాల్ రెడ్డి ఇచ్చిన వివరాల మేరకు ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 10.45 నిమిషాలకు మండలంలోని జీవిపురం నందుగల గబ్బి వెంకటరమణ ఫంక్షన్ హాల్ వద్ద నిందితులను అరెస్టు చేసి రైల్వే కోడూరు కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు. మండలంలో ప్రజలు ఏదైనా సమస్య వచ్చినచో అధికారులను సంప్రదించి సమస్యలను పరిష్కరించుకోవాలి తప్ప గ్రామాలలో గొడవలు సృష్టించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు : పది లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని ఒక మహిళను అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సిఐ టికె.తులసి తెలిపారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లె మండలం, చెన్నరాజుపోడు క్రాస్ వద్ద తనిఖీలు జరిపి పాలెం కోట లక్ష్మమ్మ అనే మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి పది లీటర్ల నాటు సార స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆమె తెలిపారు. ఈ తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్ళు మధుసూదన్‌రాజు, సోమేశ్వర్,బసిరెడ్డి,రమణారెడ్డి పాల్గొన్నారు.



నిందితురాలి అరెస్టు చూపుతున్న పోలీసులు